Cell: 9440352036
మా ప్రతి అక్షరం - ప్రజల కోసం
# చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143

WANTED
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి సెల్ : 9440815774

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 88 | Wednesday 05.03.2025 | Price : Rs.3/- | Pages : 4
అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 88 | బుధవారం 05. 03. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4

### ఓటమిని హుందాగా...
## ఒప్పుకోవాలి
### : మాజీ మంత్రి



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత కూటమి నేతలు మాట మార్చారని వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ విమర్శించారు. ఉద్యోగుల కడుపు మంటకు నిన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. ఎవరు గెలిస్తే వారే తమ అభ్యర్థి అని చెప్పుకోవడానికి సిగ్గు లేదా? అని ప్రశ్నించారు. ఓటమిని హుందాగా ఒప్పుకోవాలని సూచించారు. విశాఖలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రఘువర్మ ఓటమి తర్వాత తమకు సంబంధం లేదని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం ఆశ్చర్యం మిగతా 2 లో

### ప్రతి పౌరుడూ డిజిటల్ అక్షరాస్యుడిగా...
# మారాలి : సీఎం

**డిజిటల్ అక్షరాస్యత రాష్ట్రంగా మారాలి:చంద్రబాబు - ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించాలన్న చంద్రబాబు**

**వాట్సాప్ గవర్నెన్స్ సమర్థంగా ఉపయోగించుకునేలా చేయాలని సూచన - ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్‌లోనే పొందేలా చూడాలని ఆదేశం**



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** రాష్ట్రంలోని ప్రతి పౌరుడూ డిజిటల్ అక్షరాస్యుడిగా మారాలని, తద్వారా రాష్ట్రాన్ని సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా తీర్చి దిద్దాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. పీపుల్స్ పర్సెప్షన్, ఆర్టీజీఎస్ పైన సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ప్రగతి గురించి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రజలందరూ వాట్సాప్ గవర్నెన్స్ సులభంగా ఉపయోగించుకునేలా, ప్రభుత్వం నుంచి ఏ సేవ కావాలన్నా అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కల్పిస్తోందన్నారు. దీనిపై ప్రజల్లో ఇంకా కొంత అవగాహన తక్కువగా ఉందని, ప్రజలందరూ సమర్థవంతంగా వాట్సాప్ గవర్నెన్స్‌ను విరివిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు మిగతా 2 లో

### వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత లేదు...
# బాధ లేదు
### : నిరంజన్ రెడ్డి




హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత లేదు, బాధ లేదు అని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల పరిహారం అందించే పథకం రైతు బీమా.. రైతు చనిపోయిన ఏడు పని దినాలలో రైతు కుటుంబానికి పరిహారం అందేది. ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలలో ఒకటి రైతు బీమా, రైతుబంధు అని యూఎన్ఓకు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ప్రకటించింది. రైతు బీమా పథకం ప్రవేశపెట్టిన తరువాత డిసెంబర్ 4, 2023 బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు రాష్ట్రంలో 1,18,197 మంది రైతులు మిగతా 2 లో

### దిశా చట్టానికి...
## చట్టబద్ధత ఉందా..
### : హోంమంత్రి అనిత



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఏపీ శాసనమండలి లో దిశా చట్టం , దిశా యాప్ పై అధికార... ప్రతిపక్ష నేతల మధ్య మాటలు యుద్ధం జరిగింది. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. గత (వైసీపీ ప్రభుత్వం హయాంలో) ఐదు సంవత్సరాల్లో దిశా యాప్‌ను మగవారితో కూడా బలవంతంగా ఫోన్లో ఎక్కించారని.. దిశా చట్టమంటూ... చట్టబద్ధతలేని ఓ చట్టాన్ని తెచ్చారని తీవ్రస్థాయిలో విమర్శించారు. దిశా యాప్ ద్వారా ఎంతమందికి రక్షణ కలిగిందో విపక్ష సభ్యులు చెప్పాలని హోం మంత్రి డిమాండ్ చేశారు. అసలు దిశా చట్టానికి చట్టబద్ధత ఉందా.. లేదా.. అనేది విపక్ష సభ్యులు మిగతా 2 లో

### విచారణ జరగాలని.. వాస్తవాలు...
# బయటకు రావాలి

### అలాంటి రాజకీయాలు విద్యా వ్యవస్థకు పెద్ద కళంకం
### శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వీసీలను బెదరించిన వ్యవహారంపై ఏపీ శాసనమం డలిలో రగడ చోటు చేసుకోవడంతో సభ వాయిదా పడింది. అనంతరం మిగతా 2 లో

### ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలోనే...
# డీఎస్సీ నోటిఫికేషన్

**'తల్లికి వందనం' పథకంపై త్వరలోనే గైడ్ లైన్స్: మంత్రి లోకేశ్**

**'తల్లికి వందనం' పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామన్న మంత్రి**

**పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం**

**ఈ పథకానికి బడ్జెట్ 2025-26లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు వెల్లడి**



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ పై శాసన మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నకు ఈరోజు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వారందరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదు. ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ మిగతా 2 లో

### వైసీపీ సమాజానికి...
# హానీకరం..
## సభలో పయ్యావుల సీరియస్ కామెంట్స్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** వైసీపీపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో సంచలన కామెంట్లు చేశారు. బడ్జెట్‌పై రిప్లై ప్రారంభించిన మంత్రి.. వైసీపీపై సీరియస్ వ్యాఖ్యలు చేశారు. అలాగే రాష్ట్ర పరిస్థితిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతే కాకుండా నాటి, నేటి ప్రభుత్వాల మధ్య తేడాలను చెప్పారు. బాలయ్య డైలాగ్స్ చెబుతూ ఇరు ప్రభుత్వాల మధ్య మిగతా 2 లో

### లోకేష్‌ను ముట్టుకుంటే...
# మసైపోతారు : ఆలపాటి



గుంటూరు, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ముట్టుకుంటే మసైపోతారని వైసీపీ నేతలను గుంటూరు - కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన కూటమీ అభ్యర్థి ఆలపాటి రాజా హెచ్చరించారు. చిన్న వయసులోనే నారా లోకేష్ పరిణితి చూపించి తమ విజయాలకు తోడ్పడ్డారన్నారు. తన విజయం ఒక చరిత్ర అని ఆయన అభివర్ణించారు. ఎమ్మెల్సీగా విజయాన్ని అందుకొన్న ఆయన మిగతా 2 లో

# సంపాదకీయం

## జీడీపీతో పాటు తలసరి ఆదాయం పెరగాలి

విదేశాలతో దౌత్యసంబంధాలు, వాణిజ్య వ్యూహాలు వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల బలోపేతానికి సహకరిస్తున్నాయి. కొన్ని దేశాలు స్వతంత్రంగా ఎదుగుతున్నాయి. కొన్ని దేశాలు ఇతర దేశాల బలహీనతలను ఆసరాగా చేసుకుని, ఆయుధాల వ్యాపారం చేస్తూ, ఇతర దేశాల సంపదను కొల్లగొడుతూ, తమ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకుంటున్నాయి. భారతదేశం అనాదిగా విదేశీయుల దౌర్జన్యానికి, దోపిడీకి గురవుతున్నా, నిరంతరం న్యాయంగా జీవించడానికే ప్రాధాన్యతనిస్తున్నది. స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం తర్వాత భారత ఆర్థిక స్థితిగతుల్లో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోని బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారింది. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కేంద్ర ప్రభుత్వ ప్రయత్నించడం శుభపరిణామం.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల విషయంలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించడంవలన భారత్ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని పలువురు మేధావులు ఆందోళన చెందుతున్నారు. అమెరికా రెసిప్రోకల్ టారిఫ్‌ల వలన భారత్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఆర్థిక విశ్లేషకులు గణాంకాలతో సహా వివరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక మందగమనం వలన అనేక దేశాలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారత్ కూడా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభం చవిచూస్తున్న తరుణంలో భారత్ ఆర్థికంగా ఎదగడం ఎలా సాధ్యమయిందో, ఏయే రంగాలు అత్యధికంగా ప్రజలకు ఉపాధి కలిగిస్తున్నాయో, భవిష్యత్తులో భారత్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో కూలంకషంగా చర్చించాలి.భారతదేశంలో అపారమైన సహజ వనరులున్నాయి. ఖనిజ సంపదకు లోటు లేదు. అపారమైన జల సంపద ఉంది. ఎన్నో నదులకు భారతదేశం పుట్టినిల్లు. భారత దేశంలో ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి. ఆదాయ వనరులున్నాయి.హిందూ మహా సముద్రం అరేబియా సముద్రం, బంగాళాఖాతం సరిహద్దులుగా 7500 కి.మీ పొడవైన సముద్ర తీరప్రాంతం మనకుంది. మానవ వనరులకు కొదవలేదు. విద్యావంతులకు కొరత లేదు. యువతరం భారతదేశానికి పెద్ద వరం. భిన్నమైన భౌగోళిక స్వరూపాలతో, పచ్చని వ్యవసాయ క్షేత్రాలతో, దాదాపుగా ప్రపంచంలో పండే పంటలన్నీ మన దేశంలో పండుతాయి. అభివృద్ధికి అవసరమైన అన్ని అనుకూలాంశాలు భారతదేశంలో ఉన్నాయి. అయితే పరదాస్యం నుండి విముక్తి పొంది 78 సంవత్సరాలకు దగ్గరవుతున్నా, ఆర్థికంగా బలోపేతమవుతున్నా ఇంకా భారతదేశం వర్ధమాన దేశంగానే పరిగణింపబడడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. అణుశక్తిలోను, అంతరిక్షంలోను భారత్ ముందంజలో ఉంది. మన ఆర్థిక వ్యవస్థ విలక్షణమైన శైలిని కలిగి ఉంది. భారతదేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో కొనసాగుతున్న భారత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ సంస్థల కన్నా, ప్రైవేటు సంస్థలే పటిష్ఠమైన చర్యలతో లాభాలను ఆర్జిస్తున్నాయి. భారతదేశం స్థూల జాతీయోత్పత్తిలో సేవారంగం, పరిశ్రమలు, తయారీ రంగం, వ్యవసాయం కీలకభూమిక పోషిస్తున్నాయి.భారతదేశం స్థూలజాతీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా తగ్గుతున్నప్పటికీ, నేటికీ భారతదేశంలోని సుమారు సగం మంది జనాభాకు వ్యవసాయమే ఆధారంగా నిలవడం గమనార్హం. బ్యాంకింగ్, టెక్నాలజీ, హోటల్స్, టెలీ కమ్యూనికేషన్ మొదలైనవి సేవా రంగానికి సంబంధించినవి. భారత జిడిపిలో వ్యవసాయం సుమారు 18% కలిగి ఉంది. భారత ఆర్థిక వ్యవస్థలో 13 నుండి 14% వాటాతో తయారీ రంగం గణనీయమైన భూమిక పోషిస్తున్నది. వచ్చే పది సంవత్సరాల్లో భారత్ జిడిపిలో తయారీ రంగం భాగస్వామ్యం 21 శాతానికి చేరుకుంటుందని ఒక అంచనా.ప్రపంచదేశాలన్నీ ఆర్థికంగా కుదేలైపోతున్న సందర్భంలో భారత్ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం విశేషం. జాతీయోత్పత్తి గణనీయంగా పెరిగి భారత ఆర్థిక వ్యవస్థ 4.27 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని జపాన్‌ను అధిగమించి, సమీప భవిష్యత్తులో 5 ట్రిలియన్ల యుఎస్ డాలర్లకు చేరడం కష్టసాధ్యంకాదని ఆర్థిక పండితుల అంచనా. దశాబ్దకాలం క్రితం వరకు 10వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠవంతమై త్వరలో 5 ట్రిలియన్ల డాలర్ల మార్కును చేరుకుని మూడవ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని, 2030 నాటికి ఏడు ట్రిలియన్ల డాలర్లతో అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలకు దీటుగా మారుతుందనే అంచనాలున్నాయి. భారతదేశం ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ, జపాన్ దేశాలతో పోటీపడుతూ, ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా ఏర్పడడం ముదావహం. ఐఎంఎఫ్ డేటా ప్రకారం ఆర్థికపరంగా భారత్ తర్వాత స్థానాలను యునైటెడ్ కింగ్ డమ్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ దేశాలు ఆక్రమించాయి. జిడిపి వృద్ధిరేటు దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టతను సూచిస్తున్నది. అమెరికా తలసరి ఆదాయం 89 వేల డాలర్లు కాగా, భారత్ తలసరి ఆదాయం కేవలం 2936 యుఎస్ డాలర్లు (2 లక్షల 55 వేల రూపాయలు)గా అంచనా వేయబడింది. లగ్జెంబర్గ్, సింగపూర్, ఖతార్, ఐర్లాండ్, నార్వే, స్విట్జర్లాండ్‌లు అధిక తలసరి ఆదాయంతో ధనిక దేశాలుగా పేరొందాయి.దేశ జీడీపీలో ప్రైవేట్ వినియోగం వాటా పెరిగినందున దేశ ఆర్థిక వృద్ధి మరింత సమతుల్యంగా మారుతోందని ఇటీవల విడుదలైన క్రిసిల్ నివేదిక వెల్లడించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో ముందస్తు అంచనాలో 10 బేసిస్ పాయింట్లు స్వల్పంగా సవరించి 6.5 శాతానికి చేర్చడం జరిగింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో అంచనా వేసిన వాస్తవ ఉఆఖ వృద్ధి కరోనా మహమ్మారికి ముందు దశాబ్దంలో వచ్చిన సగటు 6.6 శాతానికి చేరువైంది. సవరించిన వృద్ధి గణాంకాలపై క్రిసిల్ చీఫ్ ఎకనామిస్ట్ ధర్మకీర్తి జోషి మాట్లాడుతూ.. గత ఏడాది వృద్ధిలో 100 బేసిస్ పాయింట్లు పెంచి 9.2 శాతానికి సవరించిన తర్వాత ఈ పెరుగుదల సాధ్యమైందని అన్నారు. సాధారణ రుతుపవనాలు, తక్కువ ఆహార ద్రవ్యోల్బణం, ప్రస్తుత ద్రవ్య చక్రంలో 75-100 బేసిస్ పాయింట్ల రేటు కోతలు వంటి అంశాల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి సాధించే అవకాశం ఉందని అంచనా వేశారు.దేశంలో ప్రైవేట్ వినియోగం నానాటికీ పెరుగుతుంది. ఇది ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ, గృహ పెట్టుబడులు రెండూ వేగంగా అభివృద్ధి చెందాయి. అయితే భారత్‌లో కార్పొరేట్ పెట్టుబడులు ఇంకా ఆశించినంతగా పుంజుకోలేదు. కొనసాగుతున్న సుంకాల యుద్ధాలు, చైనా డంపింగ్ భయం కారణంగా కార్పొరేట్ రంగం పెట్టుబడులపై అంతగా ఆసక్తి చూపడం లేదు. టారిఫ్‌ల వల్ల వచ్చే నష్టాల సంక్లిష్టత ఇప్పటికే ప్రారంభమైంది. రాబోయే నెలల్లోనూ ఇది కొనసాగే అవకాశం ఉంది. దీంతో మా అంచనాలకు ప్రతికూలతలు సృష్టిస్తుందని జోషి అన్నారు.2024-25 మూడవ త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) జీడీపీ వృద్ధి 6.2 శాతానికి పెరిగింది. ఇది రెండవ త్రైమాసికంలో సవరించిన 5.6 శాతం నుంచి పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.5 శాతంగా అంచనా. అయితే 2023-24 ఆర్థిక వృద్ధి రేటును 12 ఏళ్ల గరిష్ట స్థాయి అయిన 8.2 శాతానికి సవరించారు. మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్-జనవరి) మొదటి 10 నెలలకు ద్రవ్య లోటు రూ. 11.70 లక్షల కోట్లుగా ఉంది. ఇది వార్షిక లక్ష్యంలో 74.5 శాతంగా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సానుకూల సంకేతాలను చూపడంలో ప్రైవేట్ వినియోగం కీలక పాత్ర పోషిస్తోంది. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వానికి దారితీస్తుంది.

## ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలోనే...

చేయలేదు. దీనిపై వైసీపీ సమాధానం చెప్పాలి. ఉపాధ్యాయ నియామకాల్లో 1994 నుంచి చూస్తే.. 2,60,194 పోస్టులు భర్తీ చేశారు. అందులో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 1,80,272 పోస్టులు భర్తీ చేయడం జరిగింది. ఒక్క టీడీపీ హయాంలోనే 70 శాతం టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది. నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు డీఎస్సీ ఫైల్ పైనే మొదటి సంతకం చేశాను. అందులో భాగంగానే 02-07-24 తేదీన టెట్ నిర్వహించడం జరిగింది. 4.27 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 3.68 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. 1.87 లక్షల మంది అర్హత సాధించారు. 03-10-24 నుంచి 21-10-24 వరకు టెట్ పరీక్షను పూర్తిచేయడం జరిగింది. వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ నివేదిక త్వరలోనే రాబోతోందని భావిస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ సభ సాక్షిగా హామీ ఇస్తున్నా. ప్రతిపక్ష పార్టీ నేతలు నా శాఖకు సంబంధించి ప్రశ్నలు వేసి.. చర్చించేందుకు సిద్ధంగా లేరని, ఇది చాలా బాధాకరం. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకోవాలి" అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

**'తల్లికి వందనం' పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామన్న మంత్రి**


కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని త్వరలోనే అమలుచేయనుందని, ఇందుకు సంబంధించిన గైడ్ లైన్స్ ను త్వరలోనే ప్రకటిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. తల్లికి వందనం పథకంపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ పథకానికి బడ్జెట్ 2025-26లో రూ.9,407 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇక మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ బదులిచ్చారు. 'తల్లికి వందనం' సహా అన్ని సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామన్న లోకేశ్.. నిరుద్యోగ భృతిపై సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంపై గత వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదని విమర్శించారు. చంద్రబాబు నేతృత్వంలో గత టీడీపీ హయాంలో 1.82 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అలాగే ఎట్టిపరిస్థితుల్లోనూ మార్చి నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి తీరుతామని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు.

## ఓటమిని హుందాగా...

కలిగించిందని అమర్ నాథ్ అన్నారు. ప్రభుత్వ పనితీరుకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని చెప్పారు. ఉద్యోగులు పీఆర్సీ ఇస్తామని మోసం చేశారని, ఏనాడు జీతాలు సరిగా ఇవ్వలేదని దుయ్యబట్టారు. శ్రీనివాసులు నాయుడు కూడా కూటమి తనకు మద్దతు ప్రకటించలేదని చెప్పారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉందని చెప్పారు. కూటమి పాలనలో రుషికొండ బీచ్ కు అన్యాయం జరిగిందని విమర్శించారు. ప్రభుత్వ చేతకాని చర్యల వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు.

## ప్రతి పౌరుడూ డిజిటల్ అక్షరాస్యుడిగా...

జిల్లా కలెక్టర్లందరూ బాధ్యత తీసుకుని తమ జిల్లాలో ప్రజల్లో వాట్సాప్ గవర్నెన్స్‌ను పెద్ద ఎత్తున ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలు, సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో దీని గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు కేవలం ప్రభుత్వం నుంచి సేవలు పొందడమే కాదని, ఫిర్యాదులు, అర్జీలు కూడా పెట్టుకోవచ్చని సీఎం అన్నారు. ఈ సదుపాయం గురించి కూడా ప్రజలకు వివరించాలన్నారు. నిరక్షరాస్యులు కేవలం తమ ఫిర్యాదును వాయిస్ ద్వారా కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వానికి తెలిపే సదుపాయాన్ని త్వరలో కల్పించబోతున్నామని తెలిపారు. పౌరుల్లో డిజిటల్ అక్షరాస్యత పెరిగితే వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగిత కూడా పెరుగుతుందన్నారు. వాట్సాప్ ద్వారా ప్రస్తుతం 200 రకాలైన సేవలు ప్రజలకు అందిస్తున్నామని ఐటీ మరియు రియల్ టైమ్ గవర్నెన్స్ కార్యదర్శి భాస్కర్ కాటంనేని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెలాఖరు లోపు మరో 150 అదనపు సేవలు కల్పిస్తామని తద్వారా వాట్సాప్ ద్వారా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు 350కి చేరుతాయన్నారు. తదుపరి దశలో మొత్తం 500 సేవలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును పెద్ద ఎత్తున ఉపయోగించుకుని వన్ స్టేట్ వన్ యాప్ విధానంలో ప్రజలకు అన్ని సేవలు కేవలం ఒక ప్లాట్‌ఫాంలో లభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, వ్యవసాయశాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, అటవీశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్. సీఎం కార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, పీఎస్ ప్రద్యుమ్న, రాజమౌళి, హోంశాఖ ఐటీ సెల్ ఐజీ శ్రీకాంత్, ఐజీ ఈగల్ ఆర్ కె రవికృష్ణ, సీఈఓ వి. కరుణ, ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ సమాజానికి...

వ్యత్యాసాలను సభ ముందు ఉంచారు మంత్రి పయ్యావులు. వైసీపీ సమాజానికి హానికరం అంటూ కామెంట్స్ చేశారు. సిగరెట్ పెట్టెల మీద స్టాట్యూరీ వార్నింగ్ ఇచ్చినట్టుగా.. వైసీపీ సమాజానికి హానీకరం అంటూ పదే పదే చెప్పాల్సిన బాధ్యత తమసపై ఉందన్నారు. సభకు రాకుండా డ్రాప్ అవుట్ ఎమ్మెల్యేలు బయట కూర్చొని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం గురించి పదే పదే ప్రస్తావించడం దేనికని ప్రశ్నిస్తున్నారన్నారు. వైసీపీ హానికరం అనే విషయాన్ని ఇప్పటికే ప్రజలు గుర్తించారని.. అందుకే ఆ పార్టీని 11 స్థానాలకు పరిమితం చేశారని తెలిపారు. బక్కోడి బువ్వను లాక్కొని బలిసిపోదామంటే కుదరదని.. గత ప్రభుత్వం బక్కోడి బువ్వను లాక్కొనే ప్రయత్నం చేసింది కాబట్టే.. ప్రజలు కూటమికి అనుకూలంగా అద్భుతమైన తీర్పు ఇచ్చారని చెప్పుకొచ్చారు. "లిక్కర్ , సిగరెట్ పై వేసే స్టాట్యటరీ వార్నింగ్‌లాగా వైసీపీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ విషయాన్ని శాసన సభ్యులు జనం లోకి తీసుకువెళ్ళాలి. మీరు అనుమతిస్తే నా సమయం తగ్గించుకొని వైసీపీ వారు ఏం మాట్లాడుతారో మాట్లాడమనండి. జీత భత్యాలు, అప్పులు, వడ్డీలకు వచ్చే ఆదాయం సరిపోతుంది అది కూడా 1శాతం లోటు ఉంది ... దీనిలో కమిటెడ్ ఎక్సపెండీచర్ చూపలేదు. అప్పు చేయడం తప్పుకాదు... చేసిన అప్పు క్యాపిటల్ ఇన్వెస్టమెంట్‌లో చేయాలి... ప్రోడక్టవిటీ పెంచాలి. చంద్రబాబు ఉన్నప్పుడు వ్యవసాయ రంగం 16 శాతం.... సేవల రంగం 12 శాతం ఉండగా.. . జగన్ వచ్చాక వ్యవసాయం, సేవల రంగం 3 శాతం పడిపోయింది. ఈ మూడు శాతం ఉంటే 76 వేల కోట్లు అదనంగా వచ్చేది. అధికారులను అందరికి ఇదే డైరెక్షన్‌లో ముందుకు వెళ్లే లా చూడాలిని కోరుతున్నా. అప్పుపుట్టే సామర్థ్యం పెరిగితే ప్రాజెక్టులపై పెట్టుబడి పెట్టే శక్తి పెరుగుతుంది. 2014-19 మధ్య ఇరిగేషన్‌లో 40వేల కోట్లు ఖర్చు పెట్టారు. విడిపోతే పడిపోతాం అని అనుకున్నాం అయితే చంద్రబాబు నిలబెట్టాడు పరుగుపెట్టించారు. గత అయిదేళ్లలో వైసీపీ ఏం చేసింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి నీటి కోసం విజ్ఞప్తులు వచ్చేవి. అయితే ఇప్పుడు కృష్ణ, గుంటూరు, ఉభయగోదావరి జిల్లల నుంచి వస్తున్నాయి" అని మంత్రి తెలిపారు.

ఆర్థిక పరిస్థితిపై ప్రజెంటేషన్.. :

## విచారణ జరగాలని.. వాస్తవాలు...

శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. వీసీల రాజనామాలపై దర్యాప్తు జరపమని రెండు రోజుల క్రితం కోరామని.. ఆధారాలు ఇవ్వాలని ప్రభుత్వం కోరిందన్నారు. అన్ని ఆధారాలు నేడు మండలి ముందుకి తీసుకొని వచ్చినట్లు తెలిపారు. గవర్నర్ నియమించిన వీసీలను ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏ విధంగా రాజీనామాలు చేయమని చెపుతారని విచారణ చేయమని చెప్పామన్నారు. అయితే ప్రభుత్వం తోక ముడుచుకొని వెళ్ళిందని విమర్శించారు. విచారణ చేయకుండా సవాల్ విసిరారని.. ఈ రోజు ఏమైందని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక దాబాయింపు, బుకాయింపులు, పరుష పదజాలంతో దూషణలు చేశారన్నారు. విచారణ జరగాలని.. వాస్తవాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు. వీసీలు తప్పులు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. బెదిరింపులతో రాజీనామాలు చేయించడం విద్యా వ్యవస్థకు కళంకమని ఎమ్మెల్సీ అన్నారు. వీసీలుగా క్వాలిఫైడ్ వాళ్ళను మాత్రమే నియమిస్తారని... దానికి ఒక కమిటి ఉందని తెలిపారు. వీసీలుగా క్వాలిఫైడ్ కానీ వాళ్ళని నియమిస్తే విచారణ జరపాలన్నారు. ఉన్నత విద్యా శాఖ ఆదేశాలతో రాజీనామా చేయాలని ఆదేశించారని.. అన్న దానిపై విచారణ జరపాలని అడుగుతున్నామన్నారు.

ఎత్తు తగ్గితే ఊరుకోం... :

పోలవరంపై ఎత్తు తగిస్తున్నారా లేదా చెప్పకుండా పూర్వపరాలు చెపుతూ గొప్పలు చెప్పుకొంటున్నారన్నారు. పోలవరం ఎత్తు తగ్గించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. 45.72 ఎత్తు తగ్గిస్తే పవర్ ప్లాంట్ రాదని.. ఉత్తరాంధ్ర, రాయలసీమకి నీళ్లు రావని తెలిపారు. పోలవరంపై ఎత్తు తగ్గింపు అంశాల్లో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. చేనేత అంశంపై మాట్లాడితే.. బలహీన వర్గాల కోసం మాట్లాడితే శవాలపై పేలాలు ఎరుకోవడం అంటూ కించపరుస్తూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హామీలు ఇచ్చి మోసం చేసింది చంద్రబాబు అంటూ వ్యాఖ్యలు చేశారు. రూ.960 కోట్లతో నేతన్నను వైస్సార్సీపీ ఆదుకుందని తెలిపారు. ప్రభుత్వం సత్యదూరం అయిన మాటలు మాట్లాడుతోందన్నారు. 9 నెలల కాలంలో నేతన్నలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.

కేంద్రమే నిర్మించాలి.. కానీ :

సవాల్ చేసినప్పుడు దమ్ము ధైర్యం ఉంటే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే, మాట మీద నిలబడితే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలవరం అంచల వారీగా నిధులు ఇవ్వామని ఆడిగామని.. అందులో 41.15 ఉందన్నారు. పోలవరం 45.72 ఎత్తు వరకు ఉంటుందని చెప్పామన్నారు. పోలవరం ప్రజల జీవనాడీ అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు కాంట్రాక్టర్లకు లబ్ధికోసం పోలవరం పనిచేసిందని విమర్శించారు. రికార్డులు పరిశీలిస్తే వాస్తవాలు బయట పడతాయన్నారు. పోలవరం మన హక్కు అని.. కేంద్రం నిర్మించి ఇవ్వాలని కానీ కాంట్రాక్టర్ల కోసం చంద్రబాబు స్టేట్ బాధ్యత తీసుకుందని ఆరోపించారు.

వారికి వ్యతిరేకం కాదు.. :

విద్యుత్ డిస్కామ్‌లు సంక్షోభంలో ఉన్న వాటిని కాపాడటానికి రూ.47వేల కోట్లు పెట్టామని తెలిపారు. ఇప్పుడు ప్రజలపై వేసిన 15వేల కోట్లు ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. 14 - 19 చేసిన అప్పులో 1/3 కూడా తాము అప్పులు చేయలేదని చెప్పుకొచ్చారు. "నేను మాట్లాడే ప్రతిమాట.. రికార్డులల్లో ఉన్నదే.. బడ్జెట్‌లో పెట్టిందే.. మేము ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కడా పోటీ చేయలేదు. కూటమి ప్రభుత్వం నిలబెట్టిన అభ్యర్థులకు మేము వ్యతిరేకం అని మాత్రమే చెప్పం. రిగ్గింగ్‌లు, డబ్బుల పంపిణీ, అధికార దుర్వినియోగం చేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి గెలుపొందింది. రఘువర్మ మా అభ్యర్థి అని కూటమి నేతలు ప్రచారం చేశారు. ఇప్పుడు గెలిచిన వ్యక్తి తమ అభ్యర్థి అంటున్నారు.. మాకు పుట్టిన పిల్లోడని మా కొడుకు అనాలి..కానీ ఎవరికో పుట్టిన పిల్లాడు తమ పిల్లాడు అనడం సరైంది కాదు" అంటూ బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు చేశారు.

## దిశా చట్టానికి...

చెప్పాలన్నారు. అలాగే రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను అధికట్టడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నది.. హోంమంత్రి వంగలపూడి అనిత వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్ నిరోధించడానికి.. నిందితులపై ఉక్కుపాదం మోపడానికి సీఎం చంద్రబాబు దానికి సంబంధించిన అధికారులతో సమావేశమయ్యారని.. ప్రత్యేకంగా ఒక ఈగల్ వింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానికి ప్రభుత్వం జీవోఎంఎస్ నెం. 145 ఇచ్చిందని, దీనికి బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించడం జరిగిందని హోంమంత్రి తెలిపారు. డీఐజీ లెవెల్ అధికారి ఆధ్వర్యంలో టీమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని హోంమంత్రి అనిత తెలిపారు.

దిశా చట్టం ఉంది.. వైసీపీ.. :

వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. దిశా యాప్ ద్వారా ఎన్ని కేసులు నమోదయ్యాయో ఒకసారి లెక్కలు చూసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దిశ పోలీస్ స్టేషన్‌లను వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దిశా చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపామన్నారు. దిశా యాప్ ఇప్పుడు ప్రభుత్వం వాడకపోతే... దాని స్థానంలో కొత్త యాప్‌ని తీసుకొస్తున్నారా అని వరుదు కళ్యాణి ప్రశ్నించారు. వరుదు కళ్యాణి వ్యాఖ్యలకు సమాధానంగా... దిశా యాప్ స్థానంలో శక్తి యాప్ తీసుకొస్తున్నామని హోం మంత్రి అనిత సభకు తెలిపారు. మహిళా దినోత్సవం రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ యాప్‌ను ప్రారంభిస్తున్నట్టు హోమ్ మంత్రి తెలిపారు.

## వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి బాధ్యత లేదు..

మరణించగా రూ.5,909.85 కోట్లు ఆ రైతు కుటుంబాలకు పరిహారంగా అందించడం జరిగింది. రైతు బీమా పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6122.65 కోట్లు ఎల్ఐసీకి ప్రీమియంగా చెల్లించింది. ఏడాదికి రూ.1500 కోట్లకు గాను రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేల పైచిలుకు కుటుంబాల పరిహారం పెండింగ్‌లో ఉన్నాయని నిరంజన్ రెడ్డి తెలిపారు.

**15 నెలలలో 440కి పైగా రైతులు ఆత్మహత్యలు..**

15 నెలలలో 440కి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కరెంటు రాదు, నీళ్లు రావు, రైతుబంధు రాదు, రైతు బీమా ప్రీమియం చెల్లించరు.. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిస్తున్నది? కాంగ్రెస్ అభయహస్తంలో వ్యవసాయానికి రూ.3 లక్షల వడ్డీ లేని రుణం అన్నారు. 24 గంటల కరెంటు అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ మొదలే పెట్టలేదు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ఖాళీలను భర్తీ చేయలేదు. అసైన్డ్ పోడు భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం అని దాని ఊసెత్తడం లేదు. ప్రభుత్వ భూములను కుదువపెట్టి రైతు భరోసా కోసం అని రూ.10 వేల కోట్లు తెచ్చి రెండు నెలలు అవుతుంది.. మూడెకరాల వరకు రైతులకు కూడా రైతు భరోసా నిధులు పడలేదు. మూడెకరాల వరకు రైతు భరోసా ఇచ్చామని వ్యవసాయ మంత్రి చెబుతుంటే.. మూడెకరాల వరకు రైతులకు డబ్బులు వేయాలని ఉప ముఖ్యమంత్రి చెబుతున్నారు. పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి రూ.750 కోట్లు రైతు బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వానికి ఎందుకు మనసు రావడంలేదు? ఇది రైతు అనుకూల ప్రభుత్వమా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు.

**ప్రభుత్వం సాగునీటి మీద సమీక్ష ఎందుకు చేయలేదు?**

రైతు బీమాను ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చేస్తుంది. రైతులు కష్టపడి పంటలు పండిస్తుంటే సాగునీళ్లు లేక, కరెంటు లేక రైతుల పొలాలు ఎండుతున్నాయి, పశువులకు మేతగా మారుతున్నాయి, రాష్ట్రంలో అనేక సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు. యాసంగి సీజన్ మొదలయ్యే సమయానికి సమీక్ష చేయడంలో ప్రభుత్వం విఫలమయింది. రాష్ట్ర ప్రభుత్వ అన్ని వైఫల్యాలకు కారణం కేసీఆర్ అని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటుంది. రైతులు పంటలు వేసుకున్న తర్వాత రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డితో రైతులు పంటలు వేసుకోవద్దు అని చెప్పించారు. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖా మంత్రి చెప్పకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో సాగునీళ్లకు కొరత లేదని చెప్పించారు. మరి నీటికి, కరెంటుకు సమస్య లేకుంటే రైతులు దేనికి ఆందోళన చెందుతున్నట్లు? ప్రభుత్వం సాగునీటి మీద సమీక్ష ఎందుకు చేయలేదు? అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

**పంటలను ఊరికనే పశువులకు వదిలేస్తారా?**

ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్ శాఖా మంత్రులు ధైర్యం ఉంటే పంటలు ఎండుతున్న రైతుల పొలాల వద్దకు వెళ్లి రైతులను కలవాలి. రాష్ట్రంలో ఎక్కడా పంటలు ఎండడం లేదని ధైర్యం ఉంటే ప్రభుత్వం ప్రకటించాలి. కష్టపడి సాగు చేసే రైతులు తమ పంటలను ఊరికనే పశువులకు వదిలేస్తారా? రోజూ అబద్దాలతో కూడిన రాజకీయాలు చేయడం తప్ప ప్రభుత్వానికేమీ పట్టడం లేదు. రాష్ట్ర జనాభాలో 50 నుండి 60 శాతం ఉండే రైతులు, రైతుకూలీలు, దాని అనుబంధ రకాల ప్రజలు జీవించే వ్యవసాయరంగం గురించి పట్టించుకోకుంటే ఈ ప్రభుత్వం దేని గురించి పట్టించుకుంటుంది? రాష్ట్రంలో పుష్కలంగా నీళ్లు, వర్షాలు ఉన్నా దానిని నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైంది అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.


**సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వాన్ని శిక్షించండి..**

కరెంటు, సాగునీటి కష్టాల కారణంగా రైతు భరోసా ఇవ్వని కారణంగా రైతులు రాష్ట్రంలో ఆందోళనలో ఉన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మంత్రులు రైతుల వద్దకు వెళ్లి భరోసా కల్పించాలి.. ఆత్మహత్యలు చేసుకోవద్దని ధైర్యం కల్పించాలి. తుంగతుర్తి, సూర్యాపేటలకు 300 కిలోమీటర్ల దూరం కాళేశ్వరం నీళ్లను తీసుకువచ్చి బీఆర్ఎస్ హయాంలో పంటలు పండించారు. గోదావరిలో నీళ్లున్నా ఎత్తి పోయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. వ్యవసాయరంగాన్ని ఎంతో బాధ్యతతో కేసీఆర్ పాలనలో ముందుకు తీసుకెళ్లాం. రైతాంగం బాధలను దిగమింగాలి కానీ ఆత్మహత్యలకు పాల్పడవద్దని వేడుకుంటున్నాం.. మిమ్మల్ని మీరు శిక్షించుకోవద్దని ముకుళిత హస్తాలతో కోరుతున్నాం.. ప్రాధేయపడుతున్నాం.. వేచి ఉండండి.. సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వాన్ని శిక్షించండి. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల, వ్యవసాయం పట్ల బాధ్యత లేదు.. బాధ లేదు. రైతు, వ్యవసాయ అనుకూల విధానాలు, పథకాల అమల్లో కాంగ్రెస్ విఫలం. వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామని రాహుల్ సమక్షంలో ప్రకటించిన కాంగ్రెస్ దానిని అమలు చేయకుండా మోసం చేస్తుంది అని బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

## లోకేష్‌ను ముట్టుకుంటే...

మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదగా డిక్లరేషన్ అందుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఇది గొప్ప విజయంగా తాను భావిస్తున్నానన్నారు. 33 నియోజకవర్గాల పట్టభద్రులు.. తమ ఓటు వినియోగించుకుని తనను ఎన్నుకోవటం గొప్ప అదృష్టంగా తాను భావిస్తున్నానన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను 83 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించానని తెలిపారు. తన ప్రత్యర్థికి 63 వేల ఓట్లు మాత్రమే వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఎవరి మోచేతి నీళ్ళు తాగటానికి సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చారని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. మరోవైపు వీసీలను భయపెట్టి రాజీనామా చేయించారంటూ మండలిలో చర్చ నడుస్తోందన్నారు. అయితే తమ ప్రభుత్వం యూనివర్సిటీలను ప్రత్యేక గురుకులాలుగా భావించిందని తెలిపారు. మద్యం తాగే వారి వద్ద టీచర్లను తమ ప్రభుత్వం నియమించలేదన్నారు. యూనివర్సిటీలు రాజకీయాలకు నిలయాలుగా మారిన నేపథ్యంలో వాటి పరిస్థితుల్లో మార్పు తీసుకొస్తుంటే తమ పై విమర్శలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌటింగ్ మార్చి 3వ తేదీన ప్రారంభమైనాయి. కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజా ఘన విజయం సాధించారు. కేఎస్ లక్ష్మణ రావుపై ఆయన విజయం సాధించారు. ఈ ఎన్నికల కౌంటింగ్‌లో ప్రతి రౌండ్‌లో ఆలపాటి రాజా అధిక్యతను కనబరిచారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపొందారు. అలాగే ఉభయ గోదావరి జిల్లాలో పేరాబత్తుల రాజశేఖరం గెలుపొందారు. మరోవైపు ఆలపాటి రాజా గతంలో తెనాలి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే చంద్రబాబు కేబినెట్‌లో సైతం ఆయన మంత్రిగా కొనసాగారు. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి కూటమిగా ఏర్పడి బరిలో నిలిచాయి. సీట్ల సర్దుబాటులో భాగంగా తెనాలి అసెంబ్లీ స్థానం జనసేనకు వెళ్లింది. ఈ స్థానం నుంచి నాదెండ్ల మనోహర్ గెలుపొందారు. దీంతో ఆలపాటి రాజాను కృష్ణా గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు.

## చిన్నారి ప్రవాసిని చే భగవద్గీత పఠనం



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 04:(శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళా ప్రాంగణంలో శ్రీకాళహస్తి పట్నానికి చెందిన చెందిన చిన్నారి ఎం.ప్రవాసిని భగవద్గీత 12 వ అధ్యాయం పఠించింది. అలాగే దాని అర్థము ఆంగ్లములో వివరముగా తెలిపింది. భక్తులు ఆనందంగా తిలకించి ఆ చిన్నారిని ఆశీర్వదించారు.గతంలో ఈ చిన్నారి రాష్ట్రస్థాయిలో ఎన్ని అనేక అవార్డులు పొందింది. అనంతరం శ్రీకాళ హస్తి దేవస్థానం తరపున చిన్నారికి తీర్థప్రసాదాలు, సర్టిఫికెట్ అందించి ఆశీర్వదించారు.

### బి.సి కార్పొరేషన్ లోన్లు ....

## మంజూరు కు చర్చా కార్యక్రమం



వెదురుకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి 04: మార్చ్ 4వ తేదీ మంగళవారం వెదురు కుప్పం మండలం లో బి.సి కార్పొరేషన్ లోన్లు మంజూరు కు చర్చా కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ఎన్ ముని చంద్రా రెడ్డి,ఈ కార్య క్రమంలో క్లస్టర్ ఇంచార్జి కోనేరు చెంగల రాయ రెడ్డి, ఇనాంకోత్తూరు మాజీ సర్పంచ్ పి.డిల్లి రెడ్డి, ఇనాంకోత్తూరు గ్రామ కమిటి అధ్యక్షులు మరియు బూత్ కన్వీనర్ పి.ధర్మా రెడ్డి, పోటుచేను గ్రామ బూత్ కన్వీనర్ హేమశేఖర్ రెడ్డి, కొమర గుంట గ్రామ కమిటి అధ్యక్షులు పి.మోహన్ రెడ్డి, టిడిపి నాయకులు లోకేష్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

### జాతీయ లైన్ మెన్ దినోత్సవం సందర్బంగా ....

## కడూరు లైన్ మెన్ కు ప్రశంసా పత్రం




వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి04: వరదయ్య పాలెం మండలం లోని కడూరు సచివాలయం పరిధిలోని జూనియర్ లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న వెట్టి ప్రవీణ్ కుమార్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి విశిష్ట సేవలు అందించినందు కు వెట్టి ప్రవీన్ కుమార్ కు .ఎస్ ఈ సూపరిండెంట్ ఇంజినీర్ సురేంద్ర నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ కార్యక్రమంలో పుత్తూరు ఈ ఈ,దేవాఆశీర్వాదం,నాగలాపురం డిఈఈ రమేష్ ,వరదయ్య పాలెం మండలం ఏఈ విజయ్ వెంకటేష్ అభినందనలు తెలిపారు.

### కష్టపడడంతో పాటు ......

## ఇష్టపడి చదివితే ఉత్తమఫలితాలు

### డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు




శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి 04: శ్రీకాళహస్తి ఏర్పేడు మండలం విద్యార్థులు కష్టపడడంతో పాటు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సంఘ సేవకులు, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై. కోటేశ్వర బాబు అన్నారు. మంగళవారం మండలంలోని బండారుపల్లి, మునగల పాలెం, ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే 83 మంది విద్యార్థిని, విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల ద్వారానే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి, విద్యార్థిని రానున్న పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల్ కుమార్, మునగల పాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ వేలు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### అంగన్వాడి ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన .....

## రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్ విజయ ప్రతాప్ రెడ్డి



ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్ మార్చి 04: ఎస్ఆర్ పురం మండలం కొత్తపల్లి మిట్ట దళితవాడ అంగన్వాడి కేంద్రాన్ని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మిట్ట అంగన్వాడి టీచర్ దివ్య అంగన్వాడి పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని క్రమశిక్షణతో కూడిన చదును నేర్పిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం మండలంలోని కొత్తపల్లి మిట్ట ,ఎస్ఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు బాల్యం చాలా ముఖ్యమైన కట్టమని చదువు కోవడం వల్ల వారి జీవితం మెరుగుపడుతుందని అందరూ బాగా చదువుకోవాలని అన్నారు. రాష్ట్రంలో పిల్లల ఆరోగ్యం దృష్టి సారించి మంచి నిర్ణయం లతో పాలు గుడ్లు వంటి అధిక విటమిన్ ప్రోటీన్లను కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందిస్తుందని పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటే చదువులో ముందడుగు వేస్తారని రాష్ట్ర ప్రభుత్వం వారు బాలికలకు తొలి దశ నుంచే అభివృద్ధి పథంలో నడిపేందుకు పాలిటి ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ శంకరన్ , డిఎంసివిల్ సప్లై బాలకృష్ణ, జిల్లా విద్యాశాధికారి వరలక్ష్మి, ఐ సి టి ఎస్ అధికారి వెంకటేశ్వరి సాంఘిక వెనుకబడిన సంక్షేమ శాఖ డీడి లు చెన్నయ్య, రబ్బనీ భాష, ఎస్ఆర్ పురం మండల తాసిల్దార్ లోకనాథం పిళ్ళై,ఎంపీడీవో మోహన్ మురళి మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది

### తిరుపతి జిల్లా డీసీసీ బాలగురవం బాబు



శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి 04: శ్రీకాళహస్తి కాంగ్రెస్ పార్టీ సమన్వ యకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం ఊరందురు గ్రామం నందు రైతులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పంట పొలాల వద్ద వారితో ప్రస్తుతం ఉన్నటువంటి రేట్ల గురించి అడగగా వారు గత సంవత్సరం కంటే నేడు అత్యంత దారుణంగా రేట్లు పడిపోయాయని. పైరు కోత కోసిన తర్వాత రైస్ మిల్లులు వెనక కాళ్లు అరిగేలా తిరగవలసి వస్తుందని గత సంవత్సరం గరిష్టంగా 2500 వరకు ధర పలికితే నేడు కనీసం 1600 రూపాయలు కూడా ధర పలకడం లేదని పైగా ఈ సంవత్సరం అకాల వర్షాల కారణంగా పెట్టుబడి ఎక్కువ కావడం దిగుబడి అత్యంత గణనీయంగా పడిపోవడం జరిగిందని అన్నారు.నేడు ఉన్నటువంటి ధాన్యం రేట్లు ప్రతి రైతు యొక్క ఆర్థిక స్థితిగతులు దీనస్థితికి దిగజారిపోయేలా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాలగురవం బాబు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో భాగంగా రైతులకు 25 వేల రూపాయల ఆర్థిక సహాయం ఏడాదికి అందిస్తాం అని చెప్పిన పథకాన్ని వెనువెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలియజేశారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయినటువంటి రైతన్న నేడు గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాడని ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి వేలు, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసిటీ-ఐమాప్ పరిశ్రమచే తడ ఐటిఐలో....

## తరగతి గదుల మరమ్మత్తులు, ఆధునీకరణ







శ్రీసిటీ,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 04: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ తడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అధ్వాన్న స్థితిలో వున్న 3 తరగతి గదులకు మరమ్మత్తులు చేపట్టి ఆధునీకరించింది. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా 7.5 లక్షల రూపాయలు ఇందుకోసం వెచ్చించింది. మరమ్మతులతో పాటు తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటు చేశారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ ( సి ఎస్ ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఐమాప్ ఉన్నతాధికారుల సమక్షంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి లాంఛనంగా తరగతి గదులను కళాశాల ప్రిన్సిపాల్ దేవదానంకు అందచేశారు. ఈ సందర్భంగా ఇవామీ మాట్లాడుతూ, స్థానిక విద్యాసంస్థల మౌళిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఐమాప్ చొరవను అభినందించిన నిరీషా, శ్రీసిటీ ప్రత్యేక చొరవకు పరిశ్రమల చురుకైన భాగస్వామ్యం తోడై ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యా సంస్థల మౌళిక సదుపాయాలు చాలా వరకు మెరుగుపడ్డాయన్నారు. ఫలితంగా విద్యార్థులు నమోదు శాతం, విద్యా ఫలితాలలో మంచి పురోగతి వచ్చిందని చెప్పారు.కాగా, గడిచిన ఐదు సంవత్సరాలలో శ్రీసిటీ ప్రాంతంలో పలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు ఐమాప్ సంస్థ తమ సీఎస్సార్ నిధులలో సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసింది. ఇది కాకుండా, శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) కు అంబులెన్స్ వితరణ, తిరుపతిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్టీల్ టెస్టింగ్ కోసం యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్, మూడు డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటు, జిల్లా అగ్నిమాపక శాఖలో వనరుల పెంపుకు నిధుల సాయం వంటి కార్యక్రమాలు చేపట్టింది.

### శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ దేవర మహోత్సవం....

## ఘనంగా నిర్వహించిన రజక కులస్తులు.









కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మార్చి 04: కుప్పం పట్టణంలోని దోబీ ఘాట్ లో వెలసిన ఉబ్బ గంగమ్మ జాతరను స్థానిక రజక కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజారి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జంతు బలులు ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి ఆర్ మోహన్ ఆధ్వర్యంలో రజక కులస్తులు ఘన స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రతి ఏటా ఉబ్బ గంగమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల నాయకులుసి పవన్ చంద్ర,కన్నన్, రవికుమార్,నరసింహులు, దయాకర్, రజక కులస్తులు మరియు కుటమి నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులకు .....

### నిత్యావసరాలు పంపిణీ చేసిన

## పంచాయతీ ఈవో గురు మోహన్.



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మర్చి 04: అన్నమయ్య జిల్లా పీలేరు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 2024,25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన ఇవ్వాల్సిన బట్టలు, సోపులు, నూనె, బట్టలు, బ్లౌజ్ లాంటి నిత్యవసరాలు కార్మికులకు అందజేసిన పంచాయతీ ఈవో వై,గురు మోహన్ టిడిపి నాయకులు తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల కష్టం మరువ లేనిదని పట్టణం, వీధులు, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉంచడం బాధ్యతగా పనిచేస్తూ 115మంది కార్మికులు ప్రజారోగ్యాలు కాపాడుతూ బాధ్యతగా పనిచేస్తున్న వారికి మొదటి విడత ఇవ్వవలసిన నిత్యావసరాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ కార్యదర్శి పురం రామ్మూర్తి పీలేరు పట్టణ అధ్యక్షులు దలవాయి సురేష్ కుమార్ రెడ్డి (కంచి సూరి) సానిటరీ ఇన్స్పెక్టర్ నౌషాద్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతున్న ....

## గుర్తుతెలియని దుండగులు



కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 04: కుప్పం పట్టణంలో దొంగలు పట్టపగలే ఓ ఇంట్లో డబ్బు, బంగారం, వెండి, ఎలక్ట్రానిక్ వస్తువులు దోచుకెళ్ళినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ గోడౌన్ వెనుక వీధిలో త్యాగరాజు, భారతీ నివాసం ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని



సమయంలో గుర్తు తెలియని దొంగలు తలుపులు పగలగొట్టి బెడ్ రూంలోని బీరువా, ట్రంక్ పెట్టిలో దాచుకున్న 120 గ్రాముల బంగారం, 70 గ్రాముల వెండి, 20వేల నగదుతో పాటు డెల్ ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్ళారని త్యాగరాజు స్పష్టం చేశారు. చిరుద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని కన్నీటిపర్యంతం అయ్యారు. కుప్పం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## శ్రీ ప్రసన్న ఉబ్బమ్మ దేవర మహోత్సవం



కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 04: కుప్పం పట్టణంలోని దోబీ ఘాట్ లో వెలసిన ఉబ్బ గంగమ్మ జాతరను స్థానిక రజక కులస్తులు ఘనంగా



నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజారి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జంతు బలులు ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మహోత్సవము (ఉబ్బమ్మ జాతర) లో చిత్తూరు టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం, కుప్పం మునిసిపల్ కౌన్సిలర్ & ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, మైనారిటీ అధ్యక్షుడు జాకీర్, ప్రజల చేత ఎన్నుకోబడిన గౌరవ కౌన్సిలర్లు ఎం ఆర్ సురేష్, సోము, సోమశేఖర్, మరియు,సి ఆర్ మోహన్, దయాకర్ ,సతీష్ ,నరేష్ , మరియు తెలుగుదేశం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### మల్లప్ప కొండ వద్ద .....

## నేడే మినీ కల్చరల్ ఈవెంట్



గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 04: కుప్పం నియోజకవర్గ గుడిపల్లి మండలం లోని మల్లప్ప కొండ వద్ద బుధవారం టూరిజం అభివృద్ధి కొరకు మినీ కల్చరల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఇందులో భాగంగా కుప్పం ప్రాంత సంస్కృతి, కళలు కుప్పంలో దొరికే వివిధ రకాల వస్తువుల ప్రదర్శన,బైక్,కార్ రేసింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కుప్పం నియోజకవర్గం లోని ప్రజలు, విద్యార్థులు,యువత పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏపీలో రీవెంజ్ పాలిటిక్స్

విజయవాడ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు ఎప్పుడూ ఇలాంటి రాజకీయాలు చూడలేదు. ఇప్పుడు కొత్త తరహా పాలిటిక్స్ ను చూస్తున్నాం. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ, విపక్షాలను కేసులతో ఇబ్బందులు పెట్టడం పరిపాటిగా మారింది. ఇక ఇది సంప్రదాయంగా కొనసాగే అవకాశముంది. పార్టీ నాయకత్వాలు ఊరుకున్నా, క్యాడర్ మాత్రం ఊరుకునేట్లు కనిపించడం లేదు. నాడు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు నుంచి పార్టీ నేతలు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర వంటి నేతలను అరెస్ట్ చేసి జైల్లోకి పంపారు. ఇక క్యాడర్ సంగతి చెప్పాల్సిన పనిలేదు. అనేక అక్రమ కేసులు 2019 నుంచి 2024 మధ్య కాలంలో నమోదయ్యాయి.ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. వారు మాత్రం ఎందుకు ఊరుకుంటారు. చట్ట ప్రకారం అరెస్ట్ లు చేస్తామని చెబుతున్నప్పటికీ రివెంజ్ మాత్రం తప్పదన్న సూచనలు కూటమి ప్రభుత్వం బలంగా వినిపిస్తుంది. వరస అరెస్ట్ లు వైసీపీ నేతలను కలవరపెడుతున్నాయి. అయితే అరెస్ట్ లకు నాడు టీడీపీ కానీ, నేడు వైసీపీ నేతలు కాని భయపడటం లేదు. ఇప్పటికే నందిగం సురేశ్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళిలు అరెస్టయ్యారు. వరస కేసులు నమోదు అవతుండటంతో ఎప్పుడు ఎవరు అరెస్ట్ అవుతారోనన్న టెన్షన్ ఉన్నప్పటికీ వైసీపీ నేతలు మానసికంగా తమ అరెస్ట్ తప్పదని సిద్ధమయినట్లే కనిపిస్తుంది.ఇటు టీడీపీ, వైసీపీ క్యాడర్ మాత్రం తగ్గడం లేదు. అరెస్ట్ చేయాల్సిందేనంటూ వత్తిడి తెస్తున్నారు. తమను ఇబ్బంది పెట్టిన వారిని వదలొద్దంటూ టీడీపీ సోషల్ మీడియాలో క్యాడర్ హెచ్చరికలు జారీ చేస్తుంది. పలానా వారిని ఎప్పుడు అరెస్ట్ చేస్తారో చెప్పాలంటూ నేరుగా ప్రశ్నిస్తూ పార్టీ అధినాయకత్వానికే సవాళ్లు విసురుతుంది. అధికారంలోకి వచ్చి పది నెలలు దాటుతున్నా ఇంకా అరెస్ట్ చేయకపోవడమేంటని నిలదీస్తున్నారు. పేర్లు పెట్టి మరీ వారిని అరెస్ట్ చేయాలని, వారు అధికారంలో ఉండగా ఏలా మాట్లాడారో ఆ వీడియోలను తమ సోషల్ మీడియా అకౌంట్లో పోస్టు చేస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వంపై కూడా వత్తిడి పెరుగుతందనే చెప్పాలి.ఇక వైసీపీ క్యాడర్ కూడా ఏమాత్రం తగ్గడం లేదు. కానివ్వండి.. అరెస్ట్ చేయండి.. మేం సిద్ధం.. తాము అధికారంలోకి రాగానే మీరు కూడా లోపలికి వెళ్లాల్సి ఉంటుందని, అందుకు సిద్ధంగా ఉండాలంటూ సోషల్ మీడియాలో వార్నింగ్ ఇస్తున్నారు. తాము కూడా బ్లూ బుక్ ను మెయిన్ టెయిన్ చేస్తున్నామని, అందరి పేర్లను నోట్ చేసుకుంటున్నామని చెబుతున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులను చూసి వైసీపీ అధినేత జగన్ కూడా తన దైన శైలిలో స్పందించారు. ఎవరినీ వదిలిపెట్టబోనని జగన్ పదే పదే హెచ్చరిస్తున్నారు. తమ పార్టీ కార్యకర్తలను వేధించిన వారిని వదిలిపెట్టబోమని, కొట్టారు తీసుకున్నామని, తిరిగి ఇవ్వడంగ్యారంటీ అని ప్రకటిస్తున్నారు. దీంతో ఎవరు అధికారంలోకి వచ్చినా మరొకరు జైలులోకి వెళ్లక తప్పని పరిస్థితి ఏపీలో నెలకొంది.

## పోసానిపై 20కు పైగా కేసులు
## స్టేషన్స్ టూర్ లో కృష్ణమురళి

విజయవాడ : సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పోలీసులు కేసు నమోదయ్యాయి. నరసరావుపేట, బాపట్ల, అనంతపురం, శ్రీకుకుళం, విజయవాడ వంటి చోట్ల కేసులు నమోదయ్యాయి. దాదాపు 30కి పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. అయితే ఇందులో పథ్నాలుగు కేసులు నమోదయినట్లు చెబుతున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ పోసాని కృష్ణమురళిపై వరస కేసులు నమోదు కావడంతో ఆయన ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశం లేదంటున్నారు. ఒకదాని తర్వాత మరొక కేసు పోసాని మెడకు చుట్టుకుంటుంది.గత వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పోసాని కృష్ణమురళి చేసిన కామెంట్స్ నేడు ఆయన పాలిట శాపంగా పరిణమించాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తో పాటు వారి కుటుంబసభ్యులను దూషించిన కేసులు వరసగా నమోదయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదులు చేసినా నాడు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వరస కేసులు పోలీసులు నమోదవుతున్నాయి. దీంతో పోసాని కృష్ణమురళిని ఏపీ అంతటా తిప్పుతూ జైళ్లను మార్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇప్పటికే పథ్నాలుగు నుంచి పదిహేడు కేసులు నమోదయ్యాయి. రాజంపేట సబ్ జైలులో ఉన్న పోసాని కృష్ణమురళిని ప్రస్తుతం పీటీ వారెంట్ పై నరసరావుపేటకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మరొకచోటకు.. ఇలా ఏపీ అంతా ఆయనపై కేసులు నమోదు కావడంతో దాదాపు అన్ని సబ్ జైళ్లను చూపించే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరొక కేసు రెడీగా ఉండటంతో ఆయన నాలుగు గోడల మధ్య నుంచి ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశం లేదని న్యాయనిపుణులు సయితం అంగీకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పోసానిపై వివిధ స్టేషన్లలో 30 పైగా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. వాటిల్లో 17 కేసులు నమోదయ్యాయి. లేటెస్ట్‌గా మూడు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు రాజంపేట జైలుకి వెళ్లారు. గుంటూరుజిల్లా నరసరావుపేట టూ టౌన్ పోలీసులు, అనంతపురం రూరల్, అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు.. పోసానిని తమకు అప్పగించాలని రాజంపేట జైలు అధికారులకు పీటీ వారెంట్లు అందించారు. పోసానిని అప్పగిస్తే తీసుకెళ్లేందుకు వాహనాలు కూడా సిద్ధం చేసుకున్నారట.మూడు జిల్లాల పోలీసులు ఒకేసారి రావడంతో.. ముందుగా పోసానిని ఎవరికి అప్పగించాలనే దానిపై రాజంపేట పోలీసులు ఉన్నతాధికారులతో చర్చించారు. నిబంధనలు పరిశీలించిన అనంతరం పోసానిని పల్నాడుజిల్లా నరసరావుపేట పోలీసులకు అప్పగించారు. వైద్య పరీక్షల అనంతరం పోసానిని నరసరావుపేటకు తరలించారు. వరుసగా కేసులు.. పీటీ వారెంట్లు పోసానిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.పోసానితో పాటు వైసీపీ నేతలపై తీవ్రంగా మండిపడ్డారు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి. పోసాని ఒక మూర్ఖుడు. పోసాని లాంటి వాళ్లతో అప్పుడు తిట్టించి ఇప్పుడు గగ్గోలు పెడతారా? అని నిలదీశారు. తప్పు చేసిన వాళ్లను ఈ ప్రభుత్వం వదిలిపెట్టదన్నారుమొత్తం మీద పోసాని ఏపీ టూర్ వేయక తప్పదన్న సెటైర్లు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి.

## అమరావతికి వైసీపీ జై...

విజయవాడ, : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మూడు రాజధానుల నినాదం. ఈ నినాదంతోనే ఎన్నికలకు వెళ్లిపోయారు. ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే ఈ నినాదం వల్లనే ఓడిపోయామని వారు అంగీకరించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏకైక రాజధాని.. అది కూడా అమరావతి అన్న నినాదంతో ఎన్నికలకు వెళ్లింది. ఘన విజయం సాధించింది. వచ్చే ఐదేళ్లలో అమరావతికి ఓ రూపు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో వైసీపీ విధానం ఏమిటన్నదానిపై ఆసక్తి ఏర్పడింది. మార్చుకుంటారా ... మూడు రాజధానులకే కట్టుబడి ఉంటారా అని చర్చించుకోవడం ప్రారంభించారు. ఈ సమయంలో మాజీ మంత్రి బొత్స కీలక వ్యాఖ్యలు చేశారు. మండలిలో రాజధాని అంశంపై దుమారం రేగిన తర్వాత బొత్స సత్యనారాయణ ఇద తరహాలో బయట మాట్లాడారు. మూడు రాజదానుల విధానానికే కట్టుబడి ఉన్నారా అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బొత్స సూటిగా సమాధానం ఇవ్వలేదు. మూడు రాజధానుల విధానం అనేది అప్పటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా తీసుకున్న నిర్ణయం అన్నారు. ఇప్పుడు మళ్లీ త మపార్టీ మూడు రాజధానులకే కట్టుబడి ఉందా లేదా అన్నది తాము పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బొత్స సత్యనారాయణ .. కొద్ది రోజుల కిందట తమ విధానం మూడు రాజధానులేనని చెప్పారు. అయితే ఇప్పుడు ఆ విధానానికి కాలం చెల్లిందని.. మళ్లీ పార్టీలో చర్చిస్తామన్నారువైసీపీ 2019 ఎన్నికలకు ముందు రాజధానిని మార్చబోమని ప్రజలకు హామీ ఇచ్చింది.

# ఆధునిక యుగాన్ని ఆందోళనకు గురి చేస్తున్న సైబర్ క్రైమ్

### సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి... ఆన్లైన్ లావాదేవీలకు దూరంగా ఉండండి..
### హైటెక్ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపండి- చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 04: "సైబర్ క్రైమ్" ఆధునిక యుగాన్ని ఆందోళనకు గురి చేస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు.సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఆన్లైన్ లావాదేవీలకు కూడా దూరంగా ఉండాలని తెలియజేశారు. సైబర్ నేరస్థులు మీ డబ్బు కంటే ముందు మీ మనసును హ్యాక్ చేస్తారని ఆయన హెచ్చరించారు.ఇటీవల సైబర్ మోసాలు పెచ్చు మీరుతున్న నేపథ్యంలో.., ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలలో కూడా ఈ విషయం చర్చకు రావడంతో ... మంగళ వారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు ఢిల్లీలో స్పందించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో సైబర్ మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సైబర్ క్రైమ్ మహమ్మారికి ఆజ్యం పోసే మానసిక ఉచ్చులు, హైటెక్ దోపిడీలు, డిజిటల్ మోసాలను బట్టబయలు చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో, సౌలభ్యం రాజుగా ఉన్న ఈ సమయంలో, సైబర్ నేరస్థులు ప్రతి దుర్బలత్వాన్ని ఉపయోగించు కోవడానికి సిద్ధంగా ఉన్నారని,. ఆన్‌లైన్ షాపింగ్ నుండి బ్యాంకింగ్ వరకు, మన జీవితాలు సాంకేతికతతో లోతుగా ముడిపడి ఉందని తెలియజేశారు. ఇది సైబర్ మోసాన్ని ఎప్పుడూ ఉండే ముప్పుగా మారుస్తుందని చెప్పిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు.., భారతదేశంలోనే, 1.5 మిలియన్లకు పైగా సైబర్ నేర కేసులు నమోదయ్యాయని వివరించారాయన.. వీటిలో 60% ఆర్థిక మోసాలతో ముడిపడి ఉన్నాయనీ..అయినప్పటికీ, ఈ గణాంకాల వెనుక నిజమైన వ్యక్తులు కూడా ఉన్నార న్నారనీ ఉదహరించారు.భారతదేశం ఆర్థిక సైబర్ మోసాలకు నిలయంగా మారిందని అంతర్జాతీయంగా వెల్లడైన నేపథ్యంలో, 2023లోనే 1.13 మిలియన్ కేసులు నమో దైన విషయాన్ని భారత ప్రభుత్వం గుర్తిం చిందని చెప్పారు. దాదాపు 200,000 కేసులతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉంద ని,ఆ తర్వాత మహారాష్ట్ర,గుజరాత్, రాజస్థాన్, హర్యానాలు ఉన్నాయని లోక్ సభ ఇచ్చిన సమాధానంలో వెల్లడైందని ఆయన తెలిపారు.డిజిటల్ స్కామ్‌లలో ప్రధానంగా డబ్బు దొంగతనం జరుగుతుం డగా,కొంతమంది బాధితులను లాభదాయ కమైన ఉద్యోగ ఆఫర్ల ముసుగులో విదేశాల కు భౌతికంగా రవాణా చేస్తున్నారనీ.., ఇది డిజిటల్ బానిసత్వం అని పిలువబడే భయంకరమైన వాస్తవమన్నారు.సైబర్ నేరస్థుల అధునాతనత ఆందోళనకరమైన స్థాయికి చేరుకుందని.,, అప్రమత్తత మన గొప్ప రక్షణగా మారిందన్నారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (%ఖూ×%) లావాదేవీలు ప్రధాన లక్ష్యంగా మారుతున్నందున, అవ గాహన చాలా కీలకమన్నారు. 2022- 2023 ఆర్థిక సంవత్సరంలో %ఖూ×% మోసం కేసులు 95,000 దాటాయని, రికవరీ రేట్లు 2% నుండి 8% వరకు తక్కువగా ఉన్నా యని నివేదికలు సూచిస్తున్నాయన్నారు. డిజిటల్ యుద్ధభూమి నేరస్థులకు అనుకూ లంగా ఉందనీ, అయితే విజ్ఞతతో వ్యవహ రిస్తే డిజిటల్ మోసాలను తిప్పి కొట్టగలమ న్నారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.

### పంటల దిగుబడి పెంపుకు ....
# బయోటెక్నాలజీ వినియోగం కీలకం
### - కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్. రామస్వామి
### విస్తృత ఉపన్యాసాలు విద్యార్థులకు నూతన పరిశోధనలకు దారి చూపుతాయి - ప్రిన్సిపల్ శ్రీదేవి



ఆసిఫాబాద్ జిల్లా,చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి 04: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎన్. రామస్వామి ముఖ్య అతిథిగా హాజరై, "జన్యుపునః సంయోజక డీఎన్ఏ" అనే కీలక అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఉన్నత స్థాయి ఉపన్యాసాలు విద్యార్థులకు దిశానిర్దేశం %–% ప్రిన్సిపల్ శ్రీదేవి ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ, "ఇలాంటి విస్తృత ఉపన్యాసాలు విద్యార్థుల్లో కొత్త విషయాలపై ఆసక్తిని పెంచడంతో పాటు అదనపు జ్ఞానం అందించడానికి ఉపయో గపడతాయి. పరిశోధన వైపు విద్యార్థు లను ప్రేరేపించేందుకు ఈ తరహా కార్య క్రమాలు ఎంతో అవసరం" అని అన్నారు. జన్యుపునః సంయోజక డీఎన్ఏ వల్ల అధిక దిగుబడి %–% ప్రొఫెసర్ రామ స్వామి ప్రొఫెసర్ రామస్వామి తన ఉపన్యాసంలో "జన్యుపునః సంయోజక డీఎన్ఏ" అంశాన్ని వివరించారు. పంటల్లో అధిక దిగుబడిని సాధించేందుకు జన్యు పరివర్తిత తత్వాన్ని ఉపయోగించుకోవడం వల్ల లాభాలుండటమే కాకుండా, కొత్త రకాల మొక్కలను అభివృద్ధి చేయడం కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీటీ పత్తి, బీటీ వంకాయ వంటి జన్యు పరివర్తిత పంటల ద్వారా రైతులకు అధిక లాభాలు అందుతాయని వివరించారు. జన్యుపునః సంయోజక డీఎన్ఏ భవిష్యత్ వ్యవసాయానికి మార్గదర్శకం %–% డాక్టర్ దేవేందర్ రెడ్డి, విద్యార్థులకు బయోటెక్నా లజీపై అవగాహన కల్పించడం ద్వారా పంటల కొత్త సాగు విధానాలను అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. జన్యుపునః సంయోజక డీఎన్ఏ సాంకేతికత వ్యవసాయ రంగాన్ని విప్లవాత్మకంగా మార్చగల సామర్థ్యం కలిగి ఉందని, దీని ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. శాస్త్రీయ పరిశో ధనలపై ఆసక్తి పెంచుకుని, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు ముందుండాలని ఆయన సూచించారు.అధ్యాపకులు నర్సింగరావు, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ నరసింహం, అధ్యాపకులు మహేష్, జనార్ధన్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

### పొగాకు పసుపు కొబ్బరి తరహాలో మామిడి రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న
# జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతి నాయుడు



పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మార్చి04: జిల్లాలోని మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పొగాకు పసుపు కొబ్బరి తరహాలో మామిడి రైతులకు ప్రాదాన్యత కల్పించెందుకు ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాలో మామిడి రైతులకు ప్రత్యేక మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని సీజన్లో ప్రతియేటా మామిడి రైతులను వ్యాపారస్తులు జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారంతా ఏకమై సిండికేట్ గా మారి మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేక నిలువునా ముంచేస్తున్నారు ప్రతి యేటా సీజన్లో కాయలు కోత కొచ్చే సమయంలో దొరికిన కాడికి దోచుకోవడమే వారికి వెన్నతో పెట్టిన విద్య ఈ నేపద్యంలో మామిడి రైతులు పంటలకు వేలకు వేలు అప్పులు చేసి సంవత్సరం పొడవునా తోటలకు మందులు పిచికారీ ఎరువులు తదితర పెట్టుబడులకు లక్షలాది రూపాయలు అప్పులు చేసి వీటిమీద ఆధారపడి వారి కుటుంబాలను పోషించు కుంటున్నారు సకాలంలో పంట చేతికొచ్చే సమయంలో సిండికేట్ వ్యాపారం వలన ప్రతి సంవత్సరం రైతులకు గిట్టుబాటు ధర లేక కుచ్చు టోపీ పెడతారు రైతులకు పంటలకు పెట్టిన ఖర్చులు కూడా రాకుండా పూర్తిగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారు మరికొందరు పంట పెట్టుబడులకు తీసిన అప్పులను కట్టలేక అప్పులపాలై అలమటిస్తున్నారు మరికొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మామిడి రైతులకు ప్రాదాన్యత కల్పించెందుకు ప్రభుత్వం చొరవ చూపి వెంటనే ప్రత్యేక మ్యాంగో బోర్డును ఏర్పాటు చేపట్టి జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవాలని అలాగే జిల్లాలో మామిడి పరిశ్రమలలో తయారయ్యే పండ్ల జ్యూస్ లను తిరుపతి తిరుమల దేవస్థానానికి దేశ విదేశాల్లో నుంచి వచ్చే భక్తులకు మామిడి జ్యూస్ ప్యాకెట్ల రూపంలో అందజేయడం వలన భక్తులకు చల్లని పానీయాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది అదేవిధంగా రాష్ట్రంలో అనేక దేవాలయాలకు మరియు ప్రభుత్వ పాఠశాలలకు అంగన్వాడీలకు మధ్యాహ్నం భోజన పథకం ద్వారా పిల్లలకు ఆహారంతో పాటు మామిడి పానీయాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేయడం ద్వారా పిల్లలు స్కూళ్లకు తప్పక వెళ్తారు పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది ఇటు మామిడి రైతులకు ప్రాదాన్యత కల్పించినవారౌతారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి మామిడి రైతులకు ప్రాదాన్యత కల్పించెందుకు ప్రభుత్వం చొరవ చూపి పొగాకు పసుపు కొబ్బరి తరహాలో ప్రత్యేక మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలనీ ఎప్పటి నుంచో రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతూనే వున్నారు ఇంతవరకు ఏ ప్రభుత్వాలు వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో నైనా ప్రజాప్రతినిధులు తోపాటు సంబంధించిన అధికారులు కూడా తప్పక చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతి నాయుడు కోరుతున్నారు.

## ప్రభుత్వ ప్రచారానికి...
## ప్రైవేట్ ఏజెన్సీలు

విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించనుంది. అందుకోసం ఏజెన్సీ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 11వ తేదీన తుది గడువుగా నిర్ణయించింది. గడువులోగా దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీల్లో ఒక దాన్ని ఎంపిక చేయనుంది.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ప్రచారం చేసేందుకు సమర్థవంతమైన ప్రైవేట్ ఏజెన్సీని నియమించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే కమ్యూనికేషన్ ఏజెన్సీ ఎంపిక కోసం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుకు మార్చి 11వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. దరఖాస్తు చేసుకోవాల్సిన ఏజెన్సీలకు కొన్ని నిబంధనలను నిర్దేశించింది.ఆసక్తిగల ఏజెన్సీలు ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున గత మూడేళ్లు టర్నోవర్ కలిగి ఉండాలి. అలాగే కనీసం 100 మంది జర్నలిజం, మీడియాలో నిష్ణాతులైన ఉద్యోగులు ఉండాలనే నిబంధనలు విధించింది. వీటితో పాటు సమాచార శాఖ అధికారులు పలు నిబంధనలు పెట్టారు. ఈ నిబంధనలకు సరిపోయిన ఏజెన్సీలు మాత్రమే ప్రభుత్వానికి ప్రచారం చేసేందుకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుంది. ఆ నిబంధనలు లేకపోతే, అటువంటి ఏజెన్సీలు తిరస్కరణకు గురవుతాయి. ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం ఏటా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటారు. అయితే జనవరిలోనే కమ్యూనికేషన్ ఏజెన్సీ ఏర్పాటుపై ప్రకటన విడుదల చేసినప్పటికీ, పరిపాలన పరమైన అంశాల్లో సరవణలు చేసి మళ్లీ తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు.ఎంపికైన ఏజెన్సీ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి. అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి. సంప్రదాయ మీడియాతో పాటు దురదర్శన్, రేడియో, సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటు ఇతర ప్రముఖ భాషల్లోనూ ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ పాలన, అభివృద్ధిపై కథనాలను ఆయా మీడియాల్లో వచ్చేలా చూడాలి.మీడియా కవరేజ్, ట్రాకింగ్, విశ్లేషణ చేయడంతో పాటు వివిధ శాఖలకు చెందిన వార్తలను మీడియా సంస్థలకు తెలియజేయాల్సి ఉంటుంది. అవసరం మేరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మీడియా ప్రముఖులతో ట్రిప్‌లను నిర్వహించాలి. సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల ఇంటర్వ్యూలు ప్రముఖ వార్తా పత్రికలు, టీవీలు, ఎఫ్ఎం రేడియో చానళ్లలో వచ్చేలా చూడాలి. దేశ, విదేశాల్లోని మీడియా రంగ ముఖ్యలతో ప్రభుత్వ సమావేశాల గురించి తెలియజేయాలి. ప్రభుత్వ సానుకూల, ప్రతికూలతలపై ప్రజాభిప్రాయం సేకరించాల్సి ఉంటుంది. వాటికి అనుగుణంగా వ్యూహాలను సిఫార్సు చేయాల్సి ఉంటుంది.

## రుషికొండకు...
## బ్లూ ఫ్లాగ్... కథేంటీ ?

విశాఖపట్టణం : విశాఖలోని రుషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ గుర్తింపును కోల్పోయింది. నిర్వహణపై ఫిర్యాదులు రావడంతో ఎఫ్.ఈ.ఈ గుర్తింపును రద్దు చేసింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. తక్షణమే పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిఖపట్నంలోని రుషికొండ బీచ్ 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపును కోల్పోయింది. డెన్మార్క్‌కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్.ఈ.ఈ) సంస్థ గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేసింది. రుషికొండ బీచ్ నిర్వహణ అధ్వానంగా ఉందని ఎఫ్.ఈ.ఈకి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఎఫ్.ఈ.ఈ గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేస్తూ చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించిన 9 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి..బీచ్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం, బట్టలు మార్చుకునే గదుల దగ్గర శుభ్రత లోపించటం, నడక దారి ధ్వంసం అవ్వటం వంటి కారణాల వల్ల బ్లూ ఫ్లాగ్ ట్యాగ్‌ను తొలగించారు.రుషికొండ బీచ్‌లోకి శునకాలు రావడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి..బీచ్ నిర్వహణను ప్రైవేటు సంస్థ గాలికొదిలేయడం, పర్యాటక శాఖ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే ఇది జరిగింది..ఈ సర్టిఫికెట్ ఉపసంహరణ తాత్కాలికమేనని, భద్రతా ఆడిట్ తర్వాత బ్లూఫ్లాగ్‌ను పునరుద్ధరించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు..రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ ట్యాగ్ ఉపసంహరణపై.. ఏపీ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. తక్షణమే పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.ఈ వివాదంపై ఏపీ ప్రభుత్వం వివరణ ఇచ్చింది. బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను రద్దు చేయలేదు.. తాత్కాలికంగా మాత్రమే ఉపసంహరించారని స్పష్టం చేసింది. సేఫ్టీ ప్రోటోకాల్స్ అప్‌డేట్ చేయాలని.. బ్లూఫ్లాగ్ ఫౌండేషన్ సూచించింది. 2 రోజుల్లో ఆడిట్ తర్వాత పునరుద్ధరిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.రుషికొండ బీచ్ వైజాగ్ రైల్వే స్టేషన్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. పర్యాటకులను, స్థానికులను బాగా ఆకర్షిస్తుంది. ఈ బీచ్‌ను 'జ్యువెల్ ఆఫ్ ది ఈస్ట్ కోస్ట్' అని కూడా పిలుస్తారు.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036